సాక్షి
పల్నాడు
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



ఉద్యాన శాఖ సిబ్బందికి శిక్షణ

దుగ్గిరాల: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఉద్యాన శాఖ సిబ్బందికి ఏఓ ఆర్.విజయబాబు శిక్షణ నిర్వహించారు. పంట దిగుబడి అంచనా, కొత్త ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 41,086 క్యూసెక్కులు వదులుతున్నారు. నీటిమట్టం 43.9377 టీఎంసీలు.



ఆర్‌ఓబీ పనుల పరిశీలన

నెహ్రూనగర్: శంకర్‌విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణంలో తవ్విన మట్టిని తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఆదేశించారు. పనులను ఆయన పరిశీలించారు.

పత్రికా స్వేచ్ఛకు విఘాతం



ఇటీవల సాక్షిలో రెండు అంశాలపై వచ్చిన వార్తల విషయంలో పోలీసులు విజయవాడలోని సాక్షి కార్యాలయానికి వెళ్లి ఎడిటర్‌కు నోటీసులు జారీ చేయడం పాత్రికేయ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగించడమే. సత్యమనే సూర్యునికి చెయ్యి అడ్డం పెట్టి ఆపడం వంటిది. ఆ వార్తని ఖండిస్తూ ప్రభుత్వం ప్రకటన ఇవ్వాలే తప్పా పోలీసు వ్యవస్థను దుర్వినియోగపరచకూడదు. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం ముమ్మాటికీ గర్హనీయం.

–ఈదర గోపీచంద్, నైతిక విప్లవం పత్రిక పూర్వ సంపాదకులు, నరసరావుపేట



ఎడిటర్‌పై కేసులు ఉపసంహరించాలి

ఓ రాజకీయ పార్టీ నేత మాట్లాడిన మాటలను స్థానిక విలేకరి ద్వారా పంపబడిన సమాచారం మేరకు ప్రచురించినందుకు సాక్షి పత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు చేయటం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు నేనెక్కడా వినలేదు. ప్రతిపక్ష బాధ్యతను నిర్వర్తిస్తున్న సాక్షి పేపర్‌పై కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు దిగినట్లుగా కన్పిస్తోంది. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. గతంలో కూడా ఎడిటర్‌పై కేసు నమోదు చేసినట్లుగా విన్నాం. బేషరతుగా పెట్టిన అక్రమ కేసులన్నింటిని ఉపసంహరించుకొని చంద్రబాబు తన సీనియార్టీని కాపాడుకోవాలి.

– వై.వెంకటేశ్వరరావు, పీడీఎం రాష్ట్ర నాయకులు



న్యూస్‌రీల్

గ్రామాల్లో ప్రతి ఇంటినీ సందర్శించండి

పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి



పెదకూరపాడు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి ఆదేశించారు. ఆయన బుధవారం పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. జ్వరంతో బాధపడుతున్న రోగులను పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అనంతరం 75 తాళ్లూరు పీహెసీలో వైద్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. కాలువల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోగ్య సమస్యలున్న ప్రతి ఒక్కరినీ కలవాలని, వారి రక్త నమూనాలు తీసుకోవాలని చెప్పారు. పలు గ్రామాల్లో పర్యటించి, మురుగు ఉన్న ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యాశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి 19వరకు వివిధ క్రీడాంశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎల్.చంద్రకళ, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, మహిళా కార్యదర్శి వి.పద్మావతి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంపికలు స్పెల్- 1లో భాగంగా అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో భాగంగా ఈనెల 11న నందిగామ జెడ్పీ హైస్కూలులో సెపక్‌తక్రా, 12న డీఎస్ఏ స్టేడియంలో కరాటే, 15న చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాలలో జూడో, గట్కా, 16న డీఎస్ఏ స్టేడియంలో ఫుట్‌బాల్, 17న అచ్చంపేట గురుకుల పాఠశాలలో రగ్బీ, 18న ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈత, 19న ఏఎంజీ పాఠశాలలో బాక్సింగ్, అచ్చంపేటలో రెజ్లింగ్ (కుస్తీ) పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మాచర్లలో యువకుడి హత్య



మాచర్ల: పట్టణ శివారు శ్రీశైలం రోడ్డు గ్యాస్ కంపెనీ వద్ద మంగళవారం రాత్రి తిరుమలకొండ చంద్రశేఖర్ (26) యువకుడిని బండరాయితో మోది దుండగులు హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నించగా, మృతుడి బంధువులు న్యాయం చేయాలని అడ్డుకున్నారు. న్యాయం చేస్తామని, నిందితులను వెంటనే పట్టుకుంటామని సీఐ ప్రభాకరరావు బాధితులకు హామీ ఇచ్చారు. నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

డాక్టర్ దుర్గా భార్గవికి మూడు బంగారు పతకాలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వనం దుర్గాభార్గవికి మూడు బంగారు పతకాలు దక్కాయి. మంగళవారం విజయవాడలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 28వ స్నాతకోత్సవం సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, బంగారు పతకాలు అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎండీ పీడియాట్రిక్స్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు డాక్టర్ ధర్మవరపు అమృతవల్లి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు గోల్డ్ మెడల్, ఎండీ పీడియాట్రిక్స్‌లో ఉత్తమ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా గుర్తింపు పొందినందుకు డాక్టర్ కృష్ణారావు పురోహిత్ గోల్డ్ మెడల్, ఎండీ పీడియాట్రిక్స్ పార్ట్-2 పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించి ఉత్తమ డిజర్టేషన్ సమర్పించినందుకు ఎస్వీరావు అండ్ ఎంఎం స్వామి గోల్డ్ మెడల్‌ను భార్గవి అందుకున్నారు.

పల్నాడుకు జ్వరం

- వాతావరణ మార్పులతో ప్రతి ఇంట్లో జ్వర పీడితులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిట
- గత ప్రభుత్వంలో ఇంటింటికీ సిబ్బంది వెళ్లి సర్వే
- రోగులను గుర్తించి వైద్య సేవలు
- కూటమి ప్రభుత్వం నిర్లిప్తతపై ప్రజల ఆగ్రహం
- పారిశుద్ధ్య నిర్వహణపై విమర్శలు
- ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు కరువు
- గత్యంతరం లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు

జిల్లాలో విస్తరిస్తున్న జ్వరాలు, జలుబు, దగ్గు, ఇతర రోగాలు



జ్వరంతో వస్తున్న రోగులతో నిండిపోయిన పెదకూరపాడు పీహెచ్‌సీ ఓపీ హాల్



నరసరావుపేట ఏరియా వైద్యశాలలో ఓపీ కోసం క్యూలో నిలబడ్డ రోగులు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి, నరసరావుపేట : పల్నాడు జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెల్లు పల్లెలు జ్వరాలతో మంచానపడ్డాయి. ఇంటికొకరు ఇద్దరు చొప్పున జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. వాతావరణ మార్పులతో గత 20 రోజులుగా సీజనల్ వ్యాధులు విపరీతంగా ప్రబలుతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలో ఎక్కడ చూసినా ఇబ్బడిముబ్బడిగా జ్వర పీడితులు కనిపిస్తున్నారు. నరసరావుపేట ఏరియా వైద్యశాలలో రోజు ఓపీలు సాధారణంగా 450 ఉంటాయి. అయితే, వాతావరణ మార్పుల ద్వారా వస్తున్న జ్వరాల వల్ల ఓపీల సంఖ్య సుమారు 100 నుంచి 150 దాకా పెరగాయి. వచ్చిన వారిలో 40 శాతం టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నవారే ఉన్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి జ్వరం, జలుబు, దగ్గు, అతిసార లక్షణాలతో బాధపడుతూ వచ్చే వారి సంఖ్య పెరిగింది. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, శరీరంపై దద్దర్లు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో చిన్నారులు వైద్యాశాలలో చేరుతున్నారు. ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లే రోగులకు సుమారు రూ. 5 వేల దాకా ఖర్చు అవుతోంది. రక్త పరీక్షలు, విషజ్వరాలకు ప్రత్యేకంగా ఫ్లూయిడ్స్ పేరిట రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. పోనీ ప్రభుత్వ వైద్యశాలలకు వెళదామంటే అక్కడ మందుల లేమికి తోడు సిబ్బంది నిర్లక్ష్యంతో అటువైపు వెళ్లలేకపోతున్నారు. మరోవైపు ప్రభుత్వ వైద్యశాలల్లో రక్తపరీక్షల వద్ద రద్దీ అధికంగా ఉంది. రిపోర్ట్స్ అందించడంలో కూడా ఆలస్యం చేస్తుండటంతో రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీజన్‌ల వ్యాధులు ప్రబలుతున్నాయన్న సమాచారం రాగానే ఇంటింటికీ సచివాలయ, వైద్య సిబ్బంది వెళ్లి సర్వే నిర్వహించేవారు. ఇందులో ఎవరైనా జ్వర లక్షణాలతో బాధపడుతున్నారా? ఎంత మందికి లక్షణాలు ఉన్నాయి? ఏ మందులు వాడాలి.. ఏ ఆసుపత్రికి వెళ్లాలో సలహాలు, సూచనలు సైతం చేసేవారు. అవసరమైన మందులు ఇంటి వద్దే అందజేసేవారు. మరోవైపు గ్రామాల్లోనూ పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరిగేది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపేవారు. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశాలు తక్కువగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. దీంతో ఇంటింటికీ ఫీవర్ సర్వే సరిగా జరగడం లేదు. ఎక్కడ జ్వరబాధితులు అధికంగా ఉన్నారో తెలియడం లేదు. మరోవైపు పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో సీజనల్ వ్యాధులు అధికమవుతున్నాయి. గతంలో ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి మెరుగైన వైద్యం ఉచితంగా అందించేవారు. ప్రస్తుతం అది లేకపోవడంతో ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ జ్వరాలే !



జిల్లాలో సాధారణ జ్వరాలే వస్తున్నాయి, డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాల ప్రభావం లేదు. బాధితుల రక్త పరీక్షల్లో విష జ్వరాలు ఉన్నట్టు తేలడం లేదు. ఈ సీజన్‌లో కొంత జ్వరాల సంఖ్య అధికంగా ఉంటుంది. గ్రామాలలో ఫీవర్ సర్వే జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న జ్వరాలతో ఆందోళన చెందాల్సిన పనిలేదు, జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది.

– బి రవి, డీఎంహెచ్ఓ,పల్నాడు జిల్లా

మూడు రోజులుగా జ్వరం



గత మూడు రోజులుగా జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందిపడుతున్నా. మా పల్లెలో చాలా మంది జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ వైద్యశాలలకు వెళితే వేల రూపాయలు ఖర్చు అవుతుండటంతో జనం గుల్ల అవుతున్నారు.

– నందిగం మరియమ్మ, బులుసుపాడు, పెదకూరపాడు మండలం

పెరుగుతున్న జ్వర బాధితులు



గత 15 రోజులుగా మా గ్రామంలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జలుబు, దగ్గుతో ప్రారంభమై తీవ్ర జ్వరాల బారి నపడుతున్నారు. గతంలో ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది ఫీవర్ సర్వే పక్కాగా చేసేవారు. దీంతో ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకునేవారు.

– ముత్యం చెన్నారెడ్డి, పెదగార్లపాడు, దాచేపల్లి మండలం

అర్ధరాత్రి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

తాడేపల్లి రూరల్: కృష్ణానది కరకట్ట లోపల ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన అసైన్‌మెంట్ భూముల్లో రాత్రీ పగలు తేడా లేకుండా మట్టితవ్వకాలు నిర్వహిస్తున్నారు. తాజాగా తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో పెద్ద యంత్రాలతో తవ్వకాలు మళ్లీ ప్రారంభించారు. 2015–16 సంవత్సరాల్లో ఇలాగే అసైన్‌మెంట్ భూముల్లో తవ్వకాలు నిర్వహిస్తుంటే పది జేసీబీలు, 40 ట్రాక్టర్లను సీజ్ చేసి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి తాడేపల్లి రూరల్‌లోని గుండిమెడ, ప్రాతూరు, చిర్రావూరు తదితర ప్రాంతాల్లో అసైన్‌మెంట్ భూముల్లో మట్టి తవ్వకాలు పూర్తిగా నిలిచిపోయాయి.

జేబులు నింపుకొంటున్న మాఫియా

తిరిగి కొంతమంది రైతులను మట్టి మాఫియా వారు మభ్యపెట్టి నామమాత్రంగా నగదు ఇచ్చి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.2500 నుంచి రూ.4 వేల వరకు మాఫియా అమ్ముతోందని స్థానికులు తెలియజేశారు. అసైన్‌మెంట్ భూముల్లో వ్యవసాయం చేసుకోవడానికి భూములు ఇస్తే కొంతమంది వాటిలో మట్టితవ్వకాలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల పక్కనే పంట భూములకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానదికి 3 లక్షల నుంచి 4 లక్షల క్యూసెక్కుల వరద వస్తే ఈ అసైన్‌మెంట్ భూముల్లోకి నీరు చేరుతుందని, తవ్వకాలు వల్ల పక్కనే ఉన్న భూమి సైతం కొట్టుకుపోయే పరిస్థితి ఉందని వాపోయారు.



మట్టి తవ్వకాల తర్వాత పక్కనపెట్టిన యంత్రాలు

బోధన, పరిశోధనల్లో ఏఎన్‌యూ మేటి

- ప్రొఫెసర్ జి. చెన్నారెడ్డి
- నేడు వ్యవస్థాపక దినోత్సవం

పెదకాకాని(ఏఎన్‌యూ): బోధన, పరిశోధనల్లో ప్రత్యేకత చాటుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పేరొందిందని ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి అన్నారు. వర్సిటీ 49వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం జరగనుంది. బుధవారం డైక్‌మెన్ హాల్‌లో మీడియా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ గుంటూరు జిల్లా నల్లపాడులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ కేంద్రంగా ప్రారంభమై, స్వతంత్ర విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. ప్రాంగణంలో ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్ వంటి ఆరు కళాశాలలు ఉన్నాయని చెప్పారు. నేడు రెగ్యులర్ విధానంలో 65 యూజీ, పీజీ, వృత్తి విద్యా కోర్సులు, దూరవిద్యా విధానంలో 43 కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ జ్యోతిర్మయి మట్లాడుతూ వ్యవస్థాపక దినోత్సవానికి పూర్వ వీసీలు, ప్రొఫెసర్లు వేడుకలకు హాజరుకానున్నారని చెప్పారు. ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె.గంగాధరరావు హాజరుకానుండగా, పూర్వ వీసీలు ప్రొఫెసర్ డి. రామకోటయ్య, ప్రొఫెసర్ సీవీ రాఘవులు, ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్, ప్రొఫెసర్ వై.ఆర్. హరగోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో డాక్టర్ కె. శశిధర్, డాక్టర్ ఎస్.బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి

సీఎం సభకు బస్సులు.. విద్యార్థులకు చిక్కులు



రోకటిగుంటవారిపాలెంలో విద్యార్థులను మినీ లారీ ఎక్కించి అచ్చంపేటకు పంపుతున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు

అచ్చంపేట: అనంతపురంలో సీఎం మీటింగ్‌కు సత్తెనపల్లి డిపో నుంచి ఆర్టీసీ బస్సులు పంపడంతో పాఠశాల విద్యార్థులు బుధవారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక రోజు అయితే సరిపెట్టుకోవచ్చు.. పల్లె వెలుగు బస్సులు మూడు రోజుల పాటు గ్రామాలకు వెళ్లలేదు. సత్తెనపల్లి నుంచి మాదిపాడు రూట్లలో రోజులో కనీసం 25 ట్రిప్పులు తిరుగుతాయి. ఇందుకోసం సుమారు 20బస్సుల వరకు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం మూడింటిని మాత్రమే తిప్పుతున్నారు. మాదిపాడుకు గంటకో బస్సుకు గానూ నాలుగు, అయిదు గంటలకు ఒకసారి మాత్రమే తిప్పారు. ఇక రోకటిగుంటవారిపాలెం, తాళ్లచెరువు, కస్తల, కోనూరు గ్రామాలకు పూర్తిగా నిలిపివేశారు. ఈ పరిస్థితి మంగళవారం, బుధవారంతో పాటు గురువారం మధ్యాహ్నం వరకు ఉంటుందని ఆర్టీసీ వారే చెబుతున్నారు. దీంతో అచ్చంపేట పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఆటోలు, మిని లారీలను ఆశ్రయించారు. రోకటిగుంటవారిపాలెం నుంచి 30మందికి పైగా అచ్చంపేట హైస్కూలులో చదువుతున్నారు. బస్సులు రాకపోవడంతో తల్లిదండ్రుల మినీ ఆటోను మాట్లాడుకుని పిల్లలను దగ్గరుండి ఎక్కించి పంపారు.

దోపిడీలతో భీతిల్లుతున్న పేట ప్రజలు

- గురవాయపాలెం వద్ద కారులో వెళ్తున్న కుటుంబంపై దాడి
- మహిళపై లైంగిక దాడికి యత్నం
- ఐదు సవర్ల బంగారు అభరణాలు దోపిడీ
- రెండు రోజుల కిందట చోటుచేసుకున్న ఘటన
- తాజాగా ఆటో మళ్లించి దోపిడీ
- ప్రయాణికుడి నుంచి సెల్‌ఫోన్, నగదు, వెండి వస్తువుల అపహరణ
- వరుస దారి దోపిడీలతో నరసరావుపేట ప్రజల్లో కలకలం



నరసరావుపేట రూరల్: వరుస దారి దోపిడీలతో నరసరావుపేట ప్రజలు భీతిల్లుతున్నారు. దుండగులు దోపిడీలతో పాటు మహిళలపై కూడా లైంగిక దాడులకు పాల్పడటంతో భయపడిపోతున్నారు. ఇటీవల కారులో ప్రయాణిస్తున్న కుటుంబంపై దాడి చేసి బంగారం దోపిడీ చేయడంతో పాటు మహిళపై లైంగికదాడియత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత కుటుంబం ఫిర్యాదుతో నరసరావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పోలీసుల అదుపులో యువకుడు

ఐదుగురు యువకులు ఈ ఘతకానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి అందులో ఒకరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని గోనెపూడి గ్రామానికి చెందిన భార్యాభర్తలు కుమారుడుతో కలిసి రెండు రోజుల కిందట కారులో నరసరావుపేటలో పనిముగించుకొని స్వగ్రామానికి బయలుదేరారు. చినతురకపాలెం–గోనెపూడి రహదారి గుంతలతో అధ్వానంగా ఉండటంతో గురవాయపాలెం మీదగా పయనమయ్యారు. మార్గంమధ్యంలో స్టోన్‌క్రషర్ సమీపంలో వీరు వెళ్తున్న కారును ఐదుగురు యువకులు అటకాయించారు. బలవంతంగా అందులోని వారిని బయటకు లాక్కెళ్లారు. మహిళ మెడలో బంగారు అభరణాలు దోచుకున్నారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కుమారుడిపై బీరు సీసాతో దాడికి పాల్పడ్డారు. మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి ఆమె దుస్తులను చించారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో నివాసం ఉండే వారు వస్తారన్న భయంతో వదిలిపెట్టి వెళ్లిపోయారు. ప్రాణభయంతో గ్రామానికి చేరుకున్న బాధిత కుటుంబం జరిగిన విషయాన్ని గ్రామంలో బంధువులకు, సన్నిహితులకు వివరించారు. వెంటనే అదే రోజు రాత్రి గ్రామస్తులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అఘాయిత్యానికి పాల్పడిన వారిలో గురవాయపాలేనికి చెందిన యువకులను బాధితులు గుర్తించారు. నిందితులు నివాసం ఉండే కాలనీ వద్దకు బాధితుల బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు బాధితురాలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బెదిరించి దారి దోపిడీ

గురవాయపాలెం దారి దోపిడీ ఘటన మరువకే ముందే తాజాగా మంగళవారం రాత్రి మరొకటి చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొత్తూరుకు చెందిన గోళ్లపాడు నాని తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో తాపిమేస్త్రిగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 8గంటల సమయంలో స్వగ్రామం వెళ్లేందుకు నరసరావుపేట బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఆ సమయంలో బస్సులు లేకపోవడంతో సంతమాగులూరు అడ్డరోడ్డుకు వెళ్లేందుకు బస్టాండ్ ఎదుట ఆటో ఎక్కాడు. కొంత దూరం వెళ్లిన తరువాత మార్గంమధ్యంలో మరో వ్యక్తి ఆటో ఎక్కాడు. పెట్లూరివారిపాలెం గ్రామ సమీపంలోని చిలకలూరిపేట మేజర్ కాలువ కట్ట వైపునకు దారి మళ్లించారు. కట్టపై కొంతదూరం తీసుకువెళ్లి కత్తులతో బెదిరించారు. అతిడి దగ్గర ఉన్న రెండు సెల్ ఫోన్‌లు, నగదు, వెండి చైన్‌లను దోచుకున్నారు. బాధితుడు అర్ధరాత్రి రూరల్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో ఇద్దరు నిందితులును పోలీసులు అదుపులోకి తీసుకుని గోప్యంగా విచారిస్తున్నట్లు తెలిసింది. గురవాయపాలెం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపారు. ప్రయాణికుడిని బెదిరించి దోపిడీ చేసిన కేసులో సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

గతంలోనూ ఇదే తరహా దోపిడీలు

గురవాయపాలెం వద్ద జరిగిన దారి దోపిడీ వంటి ఘటనలు ఈ ప్రాంతానికి కొత్తేమి కాదని స్థానికులు అంటున్నారు. గురవాయపాలెం, గొనెపూడి, కోటప్పకొండ శివారు ప్రాంతాల్లో కాపుకాచి ఒంటరిగా వస్తున్న వాళ్లను లక్ష్యంగా చేసుకొని బంగారం, నగదు దోచుకుంటున్నారని తెలియవచ్చింది. అయితే, కొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేయగా మరి కొంతమంది ప్రాణభయంతో పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం లేదు. పోలీసులు అదుపులో ఉన్న నిందితుడు ఇచ్చిన సమాచారంతో దోపిడీలో ఐదుగురు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు తురకపాలెంలో తరచూ జరిగే పేకాటలో పాల్గొన్నట్లు తెలిసింది. నిందితులపై పలు పోలీస్‌స్టేషన్‌లలో దారి దోపిడీ, చోరీ కేసులు ఉన్నట్టు పోలీసు వర్గాల ద్వారా సమాచారం.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,800** గరిష్ఠం : రూ. **2,700**

మోడల్ ధర రూ. **2,300**

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **145**

కొమ్ములు : **117** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,100	10,400	10,400

కాయలు : **28** బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,100	10,400	10,400

మొత్తం అమ్మకాలు : **108.75** క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	44,120
అమ్మకాలు	46,874
నిల్వ	15,094
నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,000-14,400
నంబరు-5	10,000-13,500
273	10,500-13,700
341	10,000-15,200
4884	10,000- 14000
ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,500-14,500
నంబరు-5	10,000-13,600
341	11,000-15,600
4884	10,000-14,200
నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 - 15,300
బాడిగ 355	10,000 - 15,800
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 8,000
ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 - 15,200
బాడిగ 355	10,000 - 15,500
దువనూర్ డీలక్స్	10,500 - 14,500
తాలు	5,500 - 7,500

-కొరిటిపాడు (గుంటూరు)

నేటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు నిలుపుదల

శావల్యాపురం: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆన్‌లైన్ (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) సేవలను 11 నుంచి 15 వరకు ఆర్‌బీఐ నిబంధనలు మేరకు నిలుపుదల చేయనున్నట్లు బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాఫ్ట్‌వేర్ పనులు చేస్తున్న నేపథ్యంలో గుంటూరు, పల్నాడు, కృష్ణా, గోదావరి తదితర జిల్లాల్లోని శాఖలన్నీ నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు రక్షణ కరవు

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతల ధ్వజం
- 16న నరసరావుపేటలో విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎస్సీ సెల్ నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఎస్సీలపై దాడులు, వారి మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతల ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నబాల శామ్యూల్, పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖరరావు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేటలో ఈనెల 16న ఎస్సీ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్‌బాబు, వర్కింగ్ అధ్యక్షులు కొమ్మూరి కనకారావు, జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఎస్సీలు అంటే షెడ్యూలు క్యాస్ట్ కాదని, వైఎస్సార్ సీపీకి స్టాండర్డ్ కాస్ట్ అని గత ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లేసి నిరూపించారని తెలిపారు. పార్టీకి వచ్చిన ఓట్లలో ఎస్సీలవే అధికంగా ఉన్నాయని అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా చెప్పారని వారు పేర్కొన్నారు. పార్టీకి కంచుకోటలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను తన వారిగా చెప్పుకొని వారికి జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యమైనంత మేలు చేశారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు ఆయా వర్గాలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు వైఎస్సార్ సీపీకి దూరం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా తమ వర్గాలను వైఎస్సార్ సీపీ నుంచి విడదీయలేరని వారు స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని దళితులంతా పార్టీకి వెనుదన్నుగా ఉండాలని వారు కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చావలి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పులివెల మాణిక్యం, జిల్లా కార్యదర్శులు కాలే మాణిక్యాలరావు, నెలటూరి సురేష్, ఎస్సీ సెల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కందుల ఎజ్రా, అచ్చంపేట, యడ్లపాడు, రొంపిచర్ల మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులు శిఖా తిమోతి, వలేటి ఉదయకిరణ్, గుండాల వెంకటేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాగంలో పలువురికి చోటు

నరసరావుపేట / సత్తెనపల్లి : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన నలుగురు నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ ఎస్టీ సెల్ సెక్రటరీగా రమావత్ జనపల్ నాయక్(మాచర్ల), స్టేట్ ఐటీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా వెన్నా నరసింహారెడ్డి (గురజాల), స్టేట్ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులుగా జూలకంటి శ్రీనివాసరావు (గురజాల), స్టేట్ వాణిజ్య విభాగ కార్యదర్శిగా అచ్యుత శివప్రసాద్ (సత్తెనపల్లి) నియమితులయ్యారు.



అచ్యుత శివప్రసాద్

అచ్యుత శివప్రసాద్ గతంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించారు. తన నియామకానికి సహకరించిన సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఏ ప్రసాద్

విజయపురి సౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై రెండు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. దీనిలో భాగంగా ఏపీఎస్‌సీఆర్‌టీ కరికులం కమిటీ మెంబర్ డాక్టర్ సీఏ ప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే పరిస్థితుల్లో స్థిరంగా ఉండాలని తెలిపారు. కళాశాలలోని గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాహిత్యాభిలాషులుగా ఉంటూ సమాజ హితానికి పాటుపడాలని చెప్పారు. స్ఫూర్తివంతమైన కథలతో విద్యార్థులకు సూచనలు అందించారు. రెండవ రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కె. ప్రభాకర్ మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలైన సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగి ఉండాలని ఉన్నత విద్యావంతులుగా తయారవ్వాలని తెలిపారు. చదువొక్కటే జీవితాలను మార్చగలదని చెప్పారు. తెలంగాణ జన విజ్ఞాన వేదిక స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె. కొండల రెడ్డి విద్యార్థులకు ప్రత్యక్షంగా కొన్ని ప్రయోగాలను చూపించి సైన్స్‌పై అవగాహన కల్పించారు. కాళోజీ కవితను వినిపించి, ఆయన సాహిత్యాన్ని చదవాలని విద్యార్థులకు కిరణ్మయి సూచించారు. అందరితో రాజ్యాంగ పీఠికను పాండురంగారావు (మట్టి ప్రచురణలు) చదివించారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ నయీం భాను పర్యవేక్షణలో జరిగింది. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

మద్దిరాల నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట టౌన్: మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం 2026-27 విద్యాసంవత్సరానికి గానూ 9వ, 11వ తరగతుల ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 2025 సెప్టెంబర్ 23వ తేదీలోపు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష 2026 ఫిబ్రవరి 7న నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 9వ తరగతికి అభ్యర్థి ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందినవాడై, 2025-26 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ ఉండాలని తెలిపారు. 01-05-2011 నుంచి 31-07-2013 మధ్య పుట్టి ఉండాలని పేర్కొన్నారు. 11వ తరగతి ప్రవేశానికి అభ్యర్థి ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందినవాడై, 2025-26లో 10వ తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. 01-06-2009 నుంచి 31-07-2011 మధ్య పుట్టి ఉండాలని తెలిపారు. దరఖాస్తు విధానం, పరీక్ష విధానం సంబంధిత పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్లలో లభ్యమవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు... 9వ తరగతికి https// cbscitms. nic. in/2025/ nvsix, 11వ తరగతికి https// cbscitms. nic. in/2025/ nvsxi వెబ్‌సైట్‌కు లాగిన్ కావాలని ఆయన సూచించారు.

బెట్టింగ్‌లో నష్టపోయి యువకుడి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతూరుకు చెందిన సీతారామ్(25) మెడికల్ హోల్‌సేల్ దూకాణంలో పని చేస్తుంటాడు. క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు నష్టపోయాడు. అధిక వడ్డీలకు తెచ్చి మరీ పందేలు కాశాడు. గత కొన్ని నెలలుగా అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో సోమవారం అర్ధరాత్రి జొన్నలగడ్డ గ్రామ సమీపంలోని టిడ్కో గృహ సముదాయం వెనుక ప్రాంతంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందు విషయాన్ని స్నేహితునికి ఫోన్‌లో చెప్పాడు. అర్ధరాత్రి సీతారామ్ ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు పరిసరాలు అంతా వెతికారు. మంగళవారం ఉదయం రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. శవ పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు.

సరుకు రవాణా లక్ష్యాన్ని చేరుకోవాలి

గూడ్స్, పార్సిల్ వినియోగదారుల సమావేశంలో డీఆర్‌ఎం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

లక్ష్మీపురం: గూడ్స్, పార్సిల్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు గుంటూరు డివిజన్ అధికారులు అందుబాటులో ఉంటారని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గూడ్స్, పార్సిల్ వినియోగదారులు బిజినెస్ డెవలప్‌మెంట్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-ఆగస్టు వరకు గత సంవత్సరంతో పోల్చితే సరుకు రవాణా ఆదాయం 26.12 శాతం పెరిగిందని తెలిపారు. రెడ్డిపాలెంలో ప్రత్యేక కంటైనర్ రైలు టెర్మినల్ అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సరుకు లోడింగ్‌ను పెంచి డివిజన్ లక్ష్యాన్ని సాధించేందుకు సహకరించాల్సిందిగా కోరారు. సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ రైల్వే అందిస్తున్న ప్రోత్సాహక పథకాలు, గూడ్స్ షెడ్ అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో గూడ్స్ వినియోగదారులు ప్రేమ్, కాశిరెడ్డి, జి.వి. రమణ, హేమంత్‌కుమార్, కె.ఆర్. రెడ్డి, పార్సిల్ వినియోగదారులు రెహ్మాన్, అమీర్, ప్రభాకర్, డివిజన్ అధికారులు ఏడీఆర్‌ఎం ఎం.రమేష్‌కుమార్, సీనియర్ డీఓఎం శ్రీనాథ్, సీనియర్ డీఈఎన్ శ్రీనివాస్, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్యా బి.రాజ్, డీసీఎం వినయ్‌కాంత్, సంబంధిత డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం

- నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ నోటిఫికేషన్ విడుదల
- ఏటా రూ. 12వేల చొప్పున ఉపకార వేతనం



యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర మానవ వనరులశాఖ ఏటా జాతీయ ఉపకార వేతన పరీక్ష నిర్వహిస్తోంది. ప్రతిభ ఉన్న వారికి పేదరికం అడ్డుకారాదని చెబుతూ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు నాలుగేళ్ల పాటు ఏటా రూ. 12వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తోంది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 30వ తేదీ కాగా, ఈ ఏడాది డిసెంబర్ 7న పరీక్ష జరగనుంది. దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

అర్హులు వీరే...

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, వసతి లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.5 లక్షల లోపు ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో 7వ తరగతిలో బీసీ, ఓసీ విద్యార్థులు 55శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50శాతం మార్కులు సాధించి ఉండాలి.

దరఖాస్తు ఇలా చేయాలి

ఆసక్తి ఉన్న విద్యార్థులు www. bse. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికి ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదు. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష రుసుం రూ.100 కాగా, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 50 చొప్పున ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో లభించే ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాలి. దరఖాస్తులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు ఆధార్ కార్డులో ఉన్న విధంగానే నమోదు చేయాలి.

ఉపకార వేతనం

ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతిలో 55శాతం మార్కులు, 10వ తరగతిలో 60శాతం, ఇంటర్ మొదటి సంవత్సరంలో 55శాతం మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనం కొనసాగుతుంది. ఈ పథకం కింద ప్రతి సంవత్సరం రూ. 12వేల చొప్పున నాలుగు సంవత్సరాలకు విద్యార్థికి ఉపకార వేతనం లభిస్తుంది.

విద్యాశాఖ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ డిమాండ్
- ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పెద్దలు ఎన్నికల సమయంలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కళాశాలల బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ బకాయిలు పేరుకపోతున్నాయే తప్పా నిధులు విడుదల కావడం లేదని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఫీజు బకాయిల పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయడంతో పాటు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, మధు, హేమంత్, ఆర్.అంజిరెడ్డి, యు.రాజు పాల్గొన్నారు. తొలుత అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చి అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పేదల కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, పార్టీ శ్రేణులు

నగరంపాలెం: భూమి, భుక్తితోపాటు వెట్టి నుంచి విముక్తి కోసం పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ మహిళలపై చిన్నచూపు కనబరిచే ప్రతి ఒక్కరికీ ఆమె పోరాటం కనువిప్పు కలిగించిందని పేర్కొన్నారు. పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిందన్నారు. పేదల విముక్తి కోసం పోరాడిన వీరనారిగా కొనియాడారు. భూమి కోసం సాహించిన తొలి మహిళని చెప్పారు. కార్యక్రమంలో అరవింద్, వసంత్, పోకల వెంకటేశ్వర్లు, కొల్లూరు శివప్రసాద్, సుబ్బు, దుర్గాదేవి, బద్రి, గౌరీశంకర్, కిశోర్, శంకర్ పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ క్రీడా పోస్టర్ ఆవిష్కరణ



ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాత్సవ

గుంటూరు వెస్ట్: ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర స్థాయి క్రీడా పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9వ తేదీల్లో అనంతపురంలో రెవెన్యూ స్పోర్ట్స్ మీట్-2025లో జరుగుతుందన్నారు. దీనిలో జిల్లా నుంచి 55 మంది పాల్గొంటారని తెలిపారు. జేసీకి పుష్పగుచ్ఛ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ప్రధాన కార్యదర్శి వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి దివ్య, షేక్ దరియా వలి ఈఖీ, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. అనుపమ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్, ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యదర్శి రామారావు, బాబురావు, లీల, సంధ్యారాణి, త్రిలోక తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో తాటి చెట్లు దగ్ధం

చినగంజాం: మండలంలోని పల్లెపాలెం పంచాయతీ తూర్పుపల్లెపాలెం గ్రామంలో తాటి తోపులో పిడుగు పడి తాటి చెట్లు దగ్ధమయ్యాయి. బుధవారం సాయంత్రం మండలంలో భారీగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అకస్మాత్తుగా వచ్చిన తెల్లని కాంతితో మెరుపులు, ఉరుములు భారీ శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. పల్లెపాలెం పంచాయతీలోని తూర్పు పల్లెపాలేనికి ఉత్తరం వైపు ఉన్న తాటి తోపులో తాటి చెట్లమీద ఒక్కసారిగా పిడుగు పడటంతో సుమారు 10 చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. గృహాలకు ఎటువంటి నష్టం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కూలీ మృతి



సురేష్ మృతదేహం

మాచర్ల రూరల్: విద్యుత్ లైన్ల పనులు చేస్తూ షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జమ్మలమడకలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెల్దుర్తి మండలం, గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన ముప్పరపు సురేష్ (27) విద్యుత్ లైన్ల పనుల కోసం కాంట్రాక్టర్ రెడ్యానాయక్ తరఫున జమ్మలమడక గ్రామానికి కూలీకి వచ్చాడు. ఈ సమయంలో స్తంభం పైకి ఎక్కి పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడి మృతి చెందాడు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి



అంకమ్మ బాబు మృతదేహం

చిలకలూరిపేట టౌన్: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి గల్లంతైన వ్యక్తి ఆచూకీని బుధవారం అధికారులు కనుగొన్నారు. మండలంలోని మురికిపూడికి చెందిన కొమ్మనబోయిన అంకమ్మబాబు (40) మంగళవారం నీటి కుంటలో దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ప్రతాపరెడ్డి గ్రానైట్ క్వారీ వద్ద ఉన్న కుంటలో కాళ్లు కడుక్కుంటున్న సమయంలో అదుపు తప్పి జారిపడ్డాడు. ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మునిగిపోయి మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. కుంట లోతు, నీరు అధికంగా ఉన్నందున ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అంకమ్మబాబు మృతదేహం కోసం క్వారీ కుంటలో అదేరోజు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ లభించకపోవడంతో బుధవారం ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంది. విస్తృతంగా గాలించి ఉదయం 11 గంటలకు మృతదేహాన్ని వెలికి తీశారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మైనర్‌తో అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు

అమరావతి: మండల కేంద్రమైన అమరావతికి చెందిన బాలికపై అభ్యంతరంగా ప్రవర్తించిన వ్యక్తిపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం స్థానిక క్రోసూరు రోడ్డులో పాల బూత్ వద్దకు మైనర్ బాలిక వచ్చింది. నిర్వాహకుడు వి. ప్రవీణ్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అచ్చియ్య ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.